క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. డిసెంబర్‌లో జరిగే పరీక్షలకు విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని, మోడల్ పేపర్లు అభ్యాసం చేయించాలన్నారు. విద్యార్థులతో జాతీయ సాధన సర్వే నమూనా పరీక్షల ఫలితాలను విశ్లేషించారు. విద్యార్థులు సత్ఫలితాలు సాధించేందుకు టీచర్లు కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో మధుసూదనాచారి, హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై సమీక్ష



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

రామడుగు: రామడుగు పోలీస్‌స్టేషన్‌ను సీపీ అభిషేక్ మహంతి సోమవారం సందర్శించారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ.. స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిఘా ఏర్పాటు చేసి కదలికలను గమనించాలన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను యాక్సిడెంట్ జోన్లు, బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రామడుగు పోలీస్ స్టేషన్ ఎస్సై వి.శేఖర్ తో పాటు ఇతర అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి

మానకొండూర్: ఒత్తిడిని జయించడానికి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈసందర్భంగా తహసీల్దార్ రాజేశ్వరీ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ధ్యాన శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షల్లో ఒత్తిడిని జయించి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులను కోరారు. ఒత్తిడిని జయించడం, సమయం సద్వినియోగం చేసుకోవడం, సరైన నిర్ణయం తీసుకోవడం వంటి అనేక విషయాలపై కరీంనగర్ హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌కు చెందిన ఎం రామకృష్ణారెడ్డి, ఉజ్వలత, నోడల్ కోఆర్డినేటర్ శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజ సేవకులుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్

హుజూరాబాద్: విద్యార్థులు సమాజ సేవకులుగా ఎదగాలని హుజూరాబాద్ ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్ అన్నారు. పట్టణ శివారులోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో డిక్షనరీలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్‌ఐ మాట్లాడారు. విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, లక్ష్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అన్నిరకాల సదుపాయాలను కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐశ్య రాణి, టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుజూరాబాద్: హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న అద్దె షాపులను నామినేషన్ పద్ధతిన కేటాయించడం జరుగుతుందని హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ వి.రవీంద్రనాథ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఖాళీ షాపులను రెండేళ్ల లీజుకు ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి గలవారు 22 లోపు డిపో కార్యాలయంలో ఒంటిగంట లోపు దరఖాస్తులను సమర్పించాలని కోరారు. వివరాలకు 9959225924, 738285150, 9985379495 నంబర్లు సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక



సూత్రాల హర్షిత్

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సూత్రాల హర్షిత్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ చిరుత శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 22 నుంచి హర్యానాలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటుందని పేర్కొన్నారు.

ముందస్తు అరెస్ట్

జమ్మికుంట: పట్టణంలోని దళిత బంధు సాధన సమితి నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. 19న వరంగల్, 20న వేములవాడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో నాయకులు సురేశ్, రాజేశ్, ప్రశాంత్, రక్షిత్, సంపత్, సురేష్, ఎ రమేశ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

నిధులు రాక.. నిర్వహణ లేక

- ఏడాదిగా విడుదలకాని జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు
- అరకొరగా అందుతున్న ఆరోగ్య సేవలు
- అమలుకాని వివిధ కార్యక్రమాలు



హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

హుజూరాబాద్: జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు అందకపోవడంతో ప్రజారోగ్యం కుంటుపడుతోంది. కేంద్ర ప్రభుత్వం పథకం కింద ప్రతీ సంవత్సరం వచ్చిన నిధులను ఆరోగ్యశాఖకు కేటాయిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. జిల్లా వైద్య విధాన పరిషత్ కింద నడిచే ఆసుపత్రులకు రూ.4.50 లక్షలు, ప్రతీ పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు కేటాయించేది. కానీ సంవత్సర కాలంగా నిధులు నిలిచిపోవడంతో ఆసుపత్రి నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది, అంతేకాకుండా ప్రజలకు అరకొరగా సేవలు అందుతున్నాయి. డివిజన్ వ్యాప్తంగా హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో జిల్లా వైద్య విధాన పరిషత్ కింద రెండు ఆసుపత్రులు, ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆరోగ్య మిషన్ నిధులతో మాతాశిశు మరణాల రేటు తగ్గించటం, పారిశుధ్యం మెరుగుపరచటం, అంటువ్యాధుల నివారణ, అసంక్రామిక వ్యాధుల నివారణ, మలేరియా, డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవటం, కుష్టు, క్షయ వ్యాధి నివారణకు పనిచేయటం, పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించటం, సార్వత్రిక వ్యాధి నిరోధక సేవలు అందించటం, వ్యక్తిగత పరిశుభ్రత పెంపొందించటం, కీటక జనిత వ్యాధుల నివారణకు పనిచేయటం, కుటుంబ సంక్షేమం, గర్భిణుల ఆరోగ్యం, బాలింతల సంరక్షణకు పనిచేయాల్సి ఉంది. ఆరోగ్య మిషన్ నిధులు ఏడాదిగా అందని కారణంగా కార్యక్రమాల అమలు అంతంత మాత్రంగా సాగుతోంది.

కొనసాగని కుటుంబ నియంత్రణ శిబిరాలు

నిధుల లేమి కారణంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగటం లేదు. శిబిరాలు ఏర్పాటు చేయటం లేదు. అవసరమైన వసతులు, శస్త్ర చికిత్సలు చేసుకున్న మహిళలకు రూ.800, పురుషులకు రూ.1100 ప్రోత్సాహకంగా అందజేసేవారు. నిధులు విడుదల కాక కు.ని ఆపరేషన్ల జాడే లేదు. అలాగే పభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సందర్భంగా మందుల కొనుగోలు కోసం ఒక్కో కేసుకు రూ.1600 ఖర్చు చేసేవారు. భోజనం ఖర్చు రోజు రూ.100 ఖర్చు చేయాల్సి ఉంది. సాధారణ ప్రసవానికి మూడు రోజులు, శస్త్ర చికిత్స జరిగితే ఏడు రోజులు రూ.100 చొప్పున చెల్లించేవారు. కానీ నిధులు నిలిచిపోవడంతో ప్రజలకు ఆరోగ్య సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి.

చర్యలు చేపట్టాలి



వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలి. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే కాలంలో ప్రజలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండేలా వైద్యశాఖాధికారులు చర్యలు చేపట్టాలి. వార్డుల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– ప్రతాప రమేశ్, హుజూరాబాద్

మెరుగైన సేవలందించాలి



ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల్లోని ఆయా గ్రామాలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలందించాలి. రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖ బలోపేతానికి నిధులను వెంటనే విడుదల చేయాలి. నిరుపేదలకు అన్నిరకాల వైద్య సేవలు అందేలా చూడాలి.

– ఇటికాల స్వరూప, బీజేపీ జమ్మికుంట ఉపాధ్యక్షురాలు

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం



ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించేందుకు వైద్య సిబ్బంది అహర్నిశలు పనిచేస్తున్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించకుండా విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులకు సంబంధించి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. నిధుల వచ్చిన వెంటనే వైద్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతాం.

– చందు, డిప్యూటీ డీఎంహెచ్‌వో, హుజూరాబాద్

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ గ్రామం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రహరీ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు తగిన వసతులు కల్పించేందుకు దేవస్థానం పాలకవర్గం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బండారుపల్లి లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, జిల్లా నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, నాయకులు మార్క నర్సయ్య, చెన్నబోయిన రవి, బండారు రమేశ్, పోలు రమేశ్, ఆశిక్ పాషా, బుధారపు శ్రీనివాస్, సిరిగిరి కొండల్ రావు, అబ్దుల్ రజాక్, వి.అనిల్, రొడ్డ సాగర్,కవ్వంపల్లి మనోహర్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ



పూజలు చేస్తున్న వేదపండితులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం వేణుగోపాలస్వామి ఆలయం జీర్ణోద్ధరణ సోమవారం వేదపండితులు మధు శంకరశర్మ, మహాదేవశర్మ వేదమంత్రోచ్చరణ మధ్య నిర్వహించారు. పురాతన వేణుగోపాలస్వామి ఆలయం పునఃనిర్మాణం కోసం దాతల సహాయంతో దేవాదాయశాఖకు కంట్రిబ్యూషన్ చెల్లించగా ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లాంచి సదుపాయం కల్పించాలని వినతి

గన్నేరువరం: లోయర్ మానేరులో కరీంనగర్ నుంచి గన్నేరువరం మండలంమైలారం గ్రామ శివారు వరకు లాంచి సదుపాయం కల్పించాలని కోరుతూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి సోమవారం కరీంనగర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. మైలారం నుంచి కరీంనగర్ వరకు రెండున్నర కిలోమీటర్లు మాత్రమేనని, మండలం ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. స్పందించిన మంత్రి తెలంగాణ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్‌కు చర్యలు చేపట్టాలని ఉత్తరం రాశారని తెలిపారు. త్వరలో లాంచ్ సదుపాయం ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని కొమ్మెర రవీందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

రథయాత్ర



చొప్పదండి: చొప్పదండి పట్టణంలో సోమవారం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో జన జాగరణ రథయాత్ర నిర్వహించారు. ధర్మజాగరణ మండల సమన్వయకర్త వడ్లూరి సుధాకర్, ముఖ్య సలహాదారు ఇప్పనపల్లి సాంబయ్య రథయాత్రను ప్రారంభించారు. రథయాత్ర పట్టణంలోని వీధుల గుండా కొనసాగింది. కార్యక్రమంలో మండల ప్రముఖ్ సిరిపురం గంగారాం, దేవసాని మల్లేశం, అనుమాండ్ల శంకరయ్య, ఒల్లాల జనార్దన్, చిట్యాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనవసర యాంటీబయోటిక్స్ వాడొద్దు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

జమ్మికుంట: యాంటీ బయోటిక్స్ అతిగా వినియోగించటం వల్ల కలిగే దుష్ప్రభావాలపై రోగులు, ప్రజలకు అవగాహన కలిగించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, డీసీహెచ్ డాక్టర్ కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో హుజూరాబాద్ డివిజన్ పరిధి వావిలాల, ఇల్లందకుంట, చెల్పూర్, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది, సూపర్వైజర్స్, ఏఎన్‌ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై ఏటా నవంబర్ 18 నుంచి 24వ తేదీ వరకు ఆయా కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనవసర యాంటీ బయోటిక్స్ వాడొద్దని, వైద్య నిపుణులను సంప్రదించే మందులు వాడాలన్నారు. సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ప్రణీత, గైనకాలజిస్ట్ శ్యామల, జిల్లా, కమ్యూనిటీ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్‌గౌడ్, మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్స్ అరుణ, సదానందం, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో సోమవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పోస్టర్‌ను ముదిరాజ్ మహాసభ నాయకులు ఆవిష్కరించారు. 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో జెండా ఎగురవేసి ర్యాలీ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భిక్షపతి, జిల్లా యూత్ అధ్యక్షుడు సురేశ్, ప్రభాకర్, రాజు, స్వరూప, పాపయ్య, రమేశ్, శ్రీనివాస్, భాగయ్య, అనిల్ ఉన్నారు.

3 నెలల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృతి

ఇల్లందకుంట: కుమారుడు చనిపోయాడనే బాధతో పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు... మండలంలోని చిన్నకోమటి పల్లి గ్రామానికి చెందిన మూడేడ్ల రవిరజిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మూడు నెలల క్రితం పురుగు మందు తాగి మృతి చెందాడు. కుమారుని మృతి తట్టుకోలేక రవి(48) మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 17న పొలం దగ్గర పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మూడు నెలల వ్యవధిలో తండ్రి, కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మానకొండూర్: మండలంలోని ఊటూరు గ్రామానికి చెందిన పడాల శ్రీధర్ (35) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు... టెంట్‌హౌజ్ నిర్వహిస్తున్న శ్రీధర్‌కు హార్వెస్టర్ కూడా ఉందని, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి, ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పుల అధికమయ్యాయి. రెండెకరాల భూమి విక్రయించాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురై మానేరు వాగువద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూ తురు ఉన్నారు. శ్రీధర్ మృతిపై ఫిర్యాదు అందలేదు.

దీపోత్సవంలో అపశ్రుతి

హుజూరాబాద్: పట్టణంలోని శివాలయంలో దీపోత్సవంలో సోమవారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... శివనామస్మరణ చేస్తూ దీపాలు వెలిగిస్తున్న ఓ మహిళ చీర కొంగుకు ప్రమాదవశత్తు ఆమె నిప్పంటుకుంది. గమనించిన తోటి మహిళలు వెంటనే మంటలను ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆమెకు స్వల్ప గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

వృద్ధురాలి గల్లంతు

హుజూరాబాద్: మున్సిపల్ పరిధి దమ్మక్కపేటలో ఓ వృద్ధురాలు బావిలో పడి గల్లంతైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కొండబత్తిని రాజేశ్వరి(65) తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి బావిలో పడింది. కుటుంబ సభ్యులు వెంటనే అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని నీటిని ఉదయం నుంచి తోడేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జమ్మికుంట: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపిన వివరాలు.. పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం రాత్రి అనుమాస రాజేందర్ ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లోని బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

తప్పిన పెనుప్రమాదం



చిగురుమామిడి: సుందరగిరి–చిగురుమామిడి గ్రామాల మధ్య పొంబండ వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై గ్రానైట్ రాయి పడిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో గ్రానైట్ రాయిని సైదాపూర్ మండలం వంగర నుంచి సుందరగిరి మీదుగా కరీంనగర్ వైపు తీసుకెళ్తున్న లారీ ఎడమవైపు నుంచి వస్తోంది. ఇదే సమయంలో కరీంనగర్ నుంచి చిగురుమామిడి శివారులోని పౌల్ట్రీఫాంకు వెళ్తున్న డీసీఎం వ్యాను ఒక్కసారిగా ఎడమ నుంచి కుడివైపు తిరగడంతో లారీ డ్రైవర్ కుడివైపునకు వాహనాన్ని తిప్పడంతో గ్రానైట్ రాళ్లు కిందపడ్డాయి. ఇతర వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మైనింగ్ అధికారులు తనిఖీ చేయకపోవడం లారీ డ్రైవర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాని అన్నారు.



శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్‌లో ప్లాట్‌పాం బోర్డు మూలనపడేశారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిపే ప్లాట్‌పాం బోర్డుపై ఊరు, పట్టణాల పేర్లు ఉంటాయి. ఈ బోర్డు బోల్టులు ఊడిపోవడంతో బిగించకుండా మూలన పడేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్లాట్‌పాం బోర్డు బిగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీంద్రనాథ్, డిపోమేనేజర్, సెల్‌నంబర్: 9959225324

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

మద్దతు ధరకు అమ్ముకోవాలి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని కురిక్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని, నిబంధనల ప్రకారం తూకం వేయాలని సూచించా రు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, తాలు, తప్ప పేరుతో తూకంలో కోతలు పెట్టొద్దన్నారు. ధాన్యం తీసుకోకుండా మిల్లర్లు ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

- **కలెక్టర్‌కు ఫిర్యాదు**

జమ్మికుంట: పట్టణంలోని దుర్గాకాలనీకి చెందిన ఓ వ్యక్తి రోడ్డు విషయంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంటి నిర్మాణం చేపడుతుండగా తప్పుడు ఫిర్యాదు చేసిన విషయంపై కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశాడు. గతంలో పాత ఇల్లు ఉందని ఇంటి ముందు రోడ్డు 30 ఫీట్లు ఉండాలని ఇబ్బందులకు గురి చేస్తూ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని స్థలాన్ని పరిశీలించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

- **ప్రభుత్వంపై విమర్శలు సహించం**

వీణవంక: రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్‌హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ నాయకులు కేవలం దోచుకోవడానికే పరిమితమయ్యారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పైనే సీఎం దృష్టి పెట్టాడని పేర్కొన్నారు.

- **బస్ పాస్‌ల పంపిణీ**

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో దివ్యాంగులకు బస్ పాస్‌లను హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రజలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు.

- **ఐడీ కార్డులు..**

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆంజనేయరావు సోమవారం ఐడీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

- **ఆర్థికసాయం**

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కట్టికోల లచ్చయ్య ఆదివారం గుండెపోటుతో మృతిచెందగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల అధ్యక్షుడుఇప్ప శ్రీనివాస్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.ఐదువేలు అందించారు.

- **నాయకులపై కేసు**

వీణవంక: మండలంలోని పలు గ్రామాలకు చెందిన దళిత బంధు సాధన సమితి నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. రెండో విడుత దళిత బంధు నిధులు రానివారు నిధుల విడుదలపై నిరసన తెలుపుతూ వీణవంక బస్టాండ్ వద్ద గుమిగూడటంతో పలువురు దళిత బంధు సాధన సమితి నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

- **వెన్నెల నియామకంపై హర్షం**

హుజూరాబాద్: ప్రభుత్వం రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె గుమ్మడి వెన్నెలను నియమించడంపై జనతాదళ్ (సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు సోమవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కళాకారుల ఉద్యోగ నియామక నోటిఫికేషన్ వేయాలని కోరారు.

- **వాసుదేవారెడ్డికి నివాళి**

ఇల్లందకుంట: మండలంలోని బూజునూర్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్, సర్పంచ్, ఎంపీటీసీ పున్నం వాసుదేవారెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. మాజీ ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్ మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

- **నాయకుల పరామర్శ**

మానకొండూర్‌రూరల్: పచ్చునూర్‌లో నాలుగు రోజుల క్రితం తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు ముడగోని కనకయ్య మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం సర్వాయి పాపన్న గౌడసంఘం ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు.

- **ఎంఈవో విచారణ**

జమ్మికుంట: విద్యార్థి సంఘాల నాయకుల ఫిర్యాదుతో ఎంఈవో హేమలత సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌పై విచారణ చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బిల్డింగ్ ఒకచోట నుంచి మరో చోటుకి మార్చేప్పటికి ఎలాంటి పర్మిషన్ తీసుకోలేదని నాయకులు ఆరోపించారు. ఐఐటీ, నీట్ పేరిట రూ.వేలు తీసుకుంటున్నారని ఆరోపించారు. స్కూల్ పర్మిషన్ రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

- **అభివృద్ధి పనులు పరిశీలన**

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు సోమవారం పరిశీలించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నట్లు తెలిపారు.

- **విదార్థులకు వైద్య పరీక్షలు**

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లో సోమవారం ఆర్‌బీఎస్‌కే సంచార ఆరోగ్య బృందం సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. విద్యార్థుల బరువు, ఎత్తు, కంటిచూపు, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించారు.

- **మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం**

హుజూరాబాద్: హుజూరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బండారు సదానందం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సోమవారం వెంకటేశ్వర మ్యారేజ్ బ్యూరో కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదానందంను ఘనంగా సన్మానించారు.

- **సంతకాల సేకరణ**

శంకరపట్నం: గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని మండలంలోని మొలంగూర్ ప్రజలు సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. వైద్యులు లేక ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నామని, ఆర్‌ఎంపీలు వైద్యం చేయొద్దని ఐఎంఏ నిబంధనలతో సేవలు అందలేదం లేదని, క్వాలిఫైడ్ డాక్టర్లను గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని లేదంటే ఆర్‌ఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇప్పించాలని 22న గవర్నర్‌కు లేఖ ఇచ్చేందుకు సంతకాల సేకరణ చేపట్టామన్నారు.